అప్పులే మిగులు

- రబీ మిర్చి పంట కోత దశలో ధరలు పతనం
- క్వింటా నంబర్ వన్ తేజ రకమే గరిష్టంగా రూ.12 వేలు
- సాధారణ నాటు రకాలు రూ.10 వేల లోపే
- ఈ ధరలతో గిట్టుబాటు కాదంటున్న రైతులు
- పంట విక్రయించినా.. అప్పులే మిగులుతాయని ఆందోళన
- గతేడాది రూ.18వేల నుంచి 20 వేలకు విక్రయం

ఏటా మిర్చి పంట విక్రయిస్తే..పెట్టుబడులు పోనూ రైతులకు ఎంతోకొంత మిగిలేది. కానీ, ప్రస్తుతం కోతకు వచ్చిన రబీ మిర్చి విక్రయిస్తే..అప్పులే మిగిలేలా ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతలా పతనమైన ధరలు సాగుదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. నంబర్ వన్ తేజ రకమే గరిష్టంగా క్వింటా రూ.12 వేలు పలుకుతోందని, ఈ ధరకు విక్రయిస్తే తమకేం మిగులుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొదమగుండ్లలో కాయలు బోరాలకు పడుతున్న కూలీలు

కారెంపూడి: పంటకు ధర లేక మిర్చి రైతులు దిగాలు చెందుతున్నారు. పంట సాగు చివరికి దశకు వచ్చింది. గతేడాది క్వింటా మిర్చి రూ.18 నుంచి రూ.20 వేల వరకు విక్రయించారు. ఈ ఏడాది నంబర్ వన్ తేజ రకమే గరిష్టంగా రూ.12 వేలు పలుకుతోంది. ఇక సాధారణ నాటు రకాలు రూ.8వేల నుంచి రూ.10 వేల మధ్య ధర ఉంది. తాలు కాయలు రూ.3 వేలు మాత్రమే. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1.70 వేల ఎకరాల్లో మిర్చి సాగులో ఉంది. ఎకరా సగటు 30 క్వింటాళ్ల చొప్పున 51 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. గతంలో మిర్చి కాయలను స్థానికంగానే రైతులు అమ్ముకునేవారు. కోత కోసిన కూలీలకు, ఇతర పెట్టుబడి ఖర్చులకు రైతులు ఆ నగదు వాడుకునేవారు. నేడు ఆ వెసులుబాటు కూడా లేకుండా పోయింది. చాలా మంది కౌలు రైతులు మిర్చి కాయ కోతల కూలీలకివ్వడానికి కూడా డబ్బు లేక అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మిర్చి సాగు ఓ యజ్ఞం

మిర్చి సాగంటేనే ఒక యజ్ఞం లాంటిది. డబ్బులు భూమిలో ఎదపెట్టుకుంటూ వెళ్లడమే. పది గ్రాముల విత్తన ప్యాకెట్ ధర రూ.700. అలాంటివి ఎకరాకు పది ప్యాకెట్లు పడతాయి. మళ్లీ ఆ ప్యాకెట్లు నర్సరీలో ఇచ్చి నారు పెంచాలి. అందుకు అదనపు ఖర్చు. ఒక్క మిరప మొక్క రూపాయికి పైన పడుతుంది. అలా ఎకరాకు 17 వేల దాకా మొక్కలు పడతాయి. నారు ఏత కూలీల దగ్గర నుంచి సాగు కష్టాలు ప్రారంభమవుతాయి. నీరు పెట్టుకుంటూ.. అంతర సేద్యం చేసుకుంటూ కలుపు తీయిస్తూ.. ప్రతి ఐదు రోజులకు ఏదో ఒక పురుగు మందు తప్పనిసరిగా పిచికారి చేస్తూ ఉండాలి. బలం మందులు ఎకరాకు 50 కట్టల దాకా వేస్తూ.. మళ్లీ ఎకరాలో పండిన కాయలు కోయడానికి సగటున 300 మంది కూలీలను పెట్టుకోవాలి. మళ్లీ మిర్చిలో తాలు కాయలు ఏరించి, వాటిని గోతాలకు నింపి గుంటూరు యార్డుకు తరలించడమనేది నిజంగా క్షణం తీరిక లేని యజ్ఞం. డబ్బును మంచినీళ్ల ప్రాయంలా ఖర్చు చేస్తేనే దిగుబడి.



ఒప్పిచర్లలో కల్లంలో తాలు కాయలు ఏరుతున్న కూలీలు

ఏమీ మిగలదు..

నేను రెండెకరాలు కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశాను. ప్రస్తుతం క్వింటా రేటు రూ.10 వేలంటున్నారు. క్వింటా కోయడానికి కూలీల ఖర్చే రూ.3 వేలదాకా అవుతుంది. గతేడాది రూ.18 వేలకు పైగా విక్రయించాం. ఇప్పుడు సగానికి ధర పడిపోయింది. ఎకరాకు పెట్టుబడులు రూ.లక్షన్నర వరకు అయ్యింది. ఈ ధరకు మిర్చి విక్రయిస్తే మిగులు ఉండదు. ఇక చేసిన అప్పులే రైతులకు మిగులుతాయి.

– అంబేపల్లి శివ, రైతు, ఒప్పిచర్ల

తప్పని ధరాఘాతం

అలా అంత కష్టం చేసి భారీగా పెట్టుబడి పెట్టి పండిస్తే.. క్వింటా మిర్చికి రూ.10 వేలు రేటు అనేసరికి రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ ధర అయితే మిగులు ఎక్కడ ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రూ.లక్షన్నర నుంచి రూ.2లక్షల వరకు పెట్టుబడులు అవుతున్నాయి. ఈ లెక్కన క్వింటా రూ.18 వేలు అమ్మితేనే గిట్టుబాటు జరిగి, మిగులు కన్పిస్తుంది.

రూ.15 వేలపైన ఉంటేనే గిట్టుబాటు

నేను మూడెకరాల్లో మిర్చి సాగు చేశాను. 300 క్వింటాళ్ల వరకు మిర్చికాయలు విక్రయించారు. కిలో రూ.10 నుంచి రూ.14లకు అమ్మాను. కూలీలకు పోను ఎంతో కొంత మిగిలింది. ఇప్పుడు పండు కాయలు కోయాల్సి ఉంది. పచ్చికాయలు కోయడం వల్ల దిగుబడి తగ్గినా.. రేటు లేదు. కనీసం క్వింటా రూ.15 వేలు అయినా లేకపోతే గిట్టుబాటు కాదు. మిర్చికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

– బందారు తిరుపతిరావు, రైతు, ఒప్పిచర్ల

క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

గురజాల: స్థానిక చల్లగుండ్ల గార్డెన్ నందు ఆదివారం ఉచిత కంటి శుక్ల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో చల్లగుండ్ల శ్రీనివాస్ తెలిపారు. చల్లగుండ్ల చారిటబుల్ ట్రస్టు, శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు.

అన్నదానం మిన్న



గురజాల: అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని వైఎస్సార్ సీపీ నాయకుడు పాశం హనిమిరెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో పల్నాటి యాదాద్రిగా పేరుగాంచిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో శనివారం ఆయన అన్నదానం నిర్వహించారు. పాశం సీత, అప్పిరెడ్డి, హేమలతా, పార్వతి, శ్రీనివాస్‌రెడ్డి, పావని, విశాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అదుపుతప్పిన వాహనం



పిడుగురాళ్ల : వేగంగా వెళ్తున్న వాహనం టైర్ పగిలిపోవడంతో అదుపుతప్పిన ఘటన పిడుగురాళ్లలో ఆదివారం ఉదయం చోటచేసుకుంది. వివరాల ప్రకారం....కందుకూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఈకో వ్యాన్ కొండమోడు వద్ద రైల్వే బ్రిడ్జి మధ్య జాతీయ రహదారిపై ఒక్కసారిగా టైర్ పగిలిపోయింది. ఈ ప్రమాదంలో హైవే పక్కన ఉన్నటువంటి సేఫ్టీ గ్రిల్స్ తగలడంతో వాహనం నిలబడింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

గురజాల : మనస్తాపం చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురజాలలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గురజాల పట్టణానికి చెందిన బి.ఈశ్వరి (44) శ్రీరాంపురం రోడ్డులో నివాసం ఉంటోంది. ఆమె భర్త గత కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. రెండేళ్ల క్రితం పెద్ద కుమారుడు ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరి మృతితో ఈశ్వరి కుమిలిపోతూ ఉండేది. ఇదే క్రమంలో మధ్యాహ్నం ఇంటి తలుపులు వేసుకుని ఉరి వేసుకుంది. గమనించిన చిన్న కుమారుడు నవీన్ స్థానికులు సాయంతో తల్లిని గురజాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించాడు. వైద్యులు పరిక్షించి ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాల మార్చురీకి తరలించారు. కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా చిత్రకళా పోటీలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వాసవీ హైస్కూల్లో జెస్టిస్ ఆర్ట్ అకాడమీ, పీఏడబ్ల్యూస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో బాల బాలికలకు చిత్రకళాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ చిత్రకారులు వజ్రగిరి జెస్టిస్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల అధినేతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించామని, ఈ నెల 19వ తేదీన పాఠశాలలో జరిగే చిత్రకళా పండుగలో ప్రభుత్వ చీఫ్‌విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. న్యాయవాది పీజే లూకా, వాసవీ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎస్. అనిల్ కుమార్, కవి కమలారామ్, కేశవసూరి, జెస్టిస్ ఆర్ట్ అకాడమీ ప్రిన్సిపల్ బ్యూలా, పఠాన్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యాబోధనకు ప్రాధాన్యమివ్వాలి

పిడుగురాళ్ల: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మెరుగైన విద్యా బోధనకు ప్రాధాన్యత నివ్వాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని జానపాడు రోడ్డులో గల శుభమస్తు కల్యాణ మండపంలో శనివారం ప్రైవేట్ పాఠశాలల డైరెక్టర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే యరపతినేని పాల్గొని, మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కూడా అవకాశాలు కల్పించి మెరుగైన విద్యనందించేలా యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును డైరెక్టర్లు గజమాలతో సత్కరించారు.

ఘనంగా భీష్మ ఏకాదశి

విజయపురిసౌత్: భీష్మ ఏకాదశి వేడుకలను విజయపురిసౌత్ లోని శ్రీ సీతారామాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు గుడిపూడి బ్రహ్మాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.అష్టోత్తర శతనామావలి, విష్ణు సహస్రనామం తదితర పూజలు నిర్వహించారు. ప్రపన్న గోష్ఠి సభ్యుల చేత విష్ణు సహస్ర పారాయణం జరిగింది.అనంతరం మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భారీగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

గురజాల రూరల్: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని పల్నాటి భద్రాది లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో స్వామి వారిని వేకువ జాము నుంచి భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు వేణు ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం చేశారు. మహిళలు పాల్గొన్నారు.

రైతులను నిలువునా ముంచిన కూటమి ప్రభుత్వం



జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమంద

దుర్గి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమమే తమ ధ్యేయమని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి రైతాంగాన్ని నిలువునా ముంచాయని దుర్గి జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటలైన మిర్చి, కంది ధరలు పడిపోవటంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. తమకు ఆత్మహత్యలే శరణ్యమని దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ అంటూ కూటమి ప్రభుత్వం అబద్ధపు వాగ్దానాలు చెప్పి అధికారంలోకి వచ్చాక రైతాంగం సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. క్వింటాకు రూ.7,550 మద్దతు ధర ప్రకటించి నేటికీ మార్క్ ఫెడ్ ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. ముటుకూరులో ఏర్పాటు చేసిన మార్క్ ఫెడ్ ద్వారా నేటికీ కొనుగోలుకు జరపడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ.10వేలకు పైగా క్వింటా కొనుగోలు చేసినట్లు గుర్తుచేశారు. అదే విధంగా మిర్చిలో తేజ రకం రూ.20 వేలకు పైగా వైఎస్సార్ సీపీ హయాంలో విక్రయాలు జరిగితే, నేడు క్వింటా కేవలం రూ.10 వేలకు పడిపోయిందన్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ మంత్రులు, పార్లమెంట్ సభ్యులు స్పందించకపోవటం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.

రైతులకు వ్యాపారులు అండగా ఉండాలి

మాచర్ల రూరల్: ఆరుగాలం శ్రమించే రైతన్నలకు సరైన గిట్టుబాటు ధర అందించడంలో వ్యాపారులు సేవా భావంతో పనిచేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. శనివారం మండలంలోని రాయవరం గ్రామంలో శ్రీనివాస సాటెక్స్ డాల్ మిల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయదారులకు వ్యాపారులు సకాలంలో వారు పండించిన పంటలను కొనుగోలు చేసి మొదటగా ఆదుకునేది వారేనని, ప్రస్తుత సీజన్‌లో సరైన గిట్టుబాటు దరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి ఇబ్బందులను గుర్తుంచుకొని వ్యాపారులు తగు విధంగా సహాయ సహకారాలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాల్ మిల్లు యజమానులు వూటుకూరి సత్యనారాయణ, పవన్, టీడీపీ నాయకులు యెనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, కంభంపాటి అనిల్ తదితరులున్నారు.



మిల్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

అల్బెండజోల్ మాత్రల పంపిణీ

మాచర్ల రూరల్: విద్యార్థులకు నులిపురుగులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం అందిస్తున్న మందులను నిర్ణీత సమయంలో వారికి అందించాలని ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ అల్లి సురేష్, వైద్యులకు అల్బెండజోల్ మాత్రలు అందించి, మాట్లాడారు. విద్యార్థుల ఎదుగుదలలో నులిపురుగులు ఎంతగానో ఇబ్బంది పెడతాయని, వాటి నివారణ కొరకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పునూరు, తాళ్లపల్లి సీహెచ్‌సీ వైద్యులు వెన్నెల, ప్రవీణ్ ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, కార్యదర్శులు యెల్లెబోయిన కోటేశ్వరరావు, టీపీ సత్యనారాయణ, బిట్టు వెంకటేశ్వర్లు, ఆవుల వెంకట్రామయ్య తదితరులున్నారు.



మాత్రలు పంపిణీ చేస్తున్న అధికారులు

సాతులూరులో ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవతల ఆలయాల తొమ్మిదో వార్షికోత్సవం శనివారంతో ముగిసింది. గత నెల 31న ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఐదు రోజుల పాటూ ఘటం కుండ ఊరేగింపు నిర్వహించారు. 5వ తేదీన వసంతోత్సవం నిర్వహించారు. 6వ తేదీన పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. అదేరోజు అన్నదానం చేశారు. 7వ తేదీ మొక్కుబడులు తీర్చుకున్నారు. 8వ తేదీన గ్రామ పురవీధుల్లో సిడిమానోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాంప్రదాయబద్ధమైన మేళతాళాలతో స్వామి వారిని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలంకరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



సాతులూరులో సిడి మానోత్సవంలో గ్రామస్తులు

బైపాసుకి రిటైనింగ్ వాల్



యడ్లపాడు: మండలం పరిధిలోని తిమ్మాపురం చేపల చెరువు సమీపంలో ప్రారంభం అయ్యే బైపాస్ రహదారి రిటైలింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తిమ్మాపురం నుంచి రూరల్ మండలం రామచంద్రాపురం డొంక వరకు 16.384 కి.మీ మేర సుమారు రూ.954 కోట్లతో నిర్మించిన ఈ బైపాస్ రహదారిని గతేడాది డిసెంబర్ 5వ తేదీన అమరావతి పీఐయూ ఎన్‌హెచ్ పీడీ పార్వతీశం ప్రారంభించి ట్రాఫిక్‌ను వదిలిన విషయం తెలిసిందే. బైపాస్‌కు సంబంధించి అన్ని మేజర్ పనులు పూర్తి చేసినప్పటికీ ఇంకా కొన్ని పనులు ఉన్నా యి. వీటిలో భాగంగా తిమ్మాపురం హైవే వంతెన సర్వీసు మార్గంలో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. తారురోడ్డు ఎత్తు అధికంగా ఉన్నందున మట్టి జారకుండా ఉండేందుకు నాపరాళ్లతో రిటైనింగ్ వాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా పనులు శరవేగంగా చేస్తున్నట్లు హైవే సిబ్బంది తెలిపారు.

ఘనంగా నాగమౌనీంద్ర స్వామి తిరునాళ్ల

బొల్లాపల్లి: మండలంలోని పేరూరుపాడు గ్రామంలో నాగమౌనీంద్ర స్వామి తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయానికి చేరుకొని నాగమౌనీంద్ర స్వామిని దర్శించుకొని పొంగళ్లతో నైవేద్యం సమర్పించారు. ఏపీ అసెంబ్లీ చీఫ్‌విప్, నియోజకవర్గ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ నిర్వహించారు. గ్రామంలో భక్తుల ఉల్లాసం కోసం రెండు భారీ విద్యుత్ ప్రభలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సుభాని

చిలకలూరిపేట: అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శిగా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన షేక్ సుభాని ఎంపికయ్యారు. శ్రీకాకుళంలో ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభల్లో ఆయనను ఈ పదవికి ఎంపిక చేశారు. విద్యార్థి దశ నుంచి విద్యార్థి, యువజన, నిరుద్యోగ సమస్యలపై నిరంతరం ఉద్యమాల్లో పాల్గొంటూ సుభాని ఈ ప్రాంతంలో సుపరిచితుడు. ఆయనకు ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పదవి వరించటం పట్ల పలువురు విద్యార్థి, యువజన, సీపీఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ముమ్మరంగా సత్రశాలలో శివరాత్రి ఏర్పాట్లు

వలంటరీ సేవకులకు దేవస్థానం ఆహ్వానం

సత్రశాల(రెంటచింతల): ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 26 న జరగనున్న మహాశివరాత్రి వేడుకలకు సంబంధించిన పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అతిపురాతనమైన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ దేవస్థానానికి రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక స్థానం ఉంది. శివరాత్రి సందర్భంగా తరలి వచ్చే వేలాది మంది భక్తులకు ఏలాంటి ఇబ్బందులు పడకుండా స్వామివారి దర్శనం చేసుకునే విధంగా బారికేట్లు, మంచినీటి సదుపాయం, పార్కింగ్, మహిళలు స్నానాలు చేసేందుకు కృష్ణానది వద్ద వసతి, విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానం కమిటీ సభ్యులు, పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం, ఏపీ జెన్‌కో నాగార్జున సాగర్ టైయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు, వివిధ శాఖాధికారుల సహాయ సహకారాలతో భక్తులకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నూరు శాతం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎంతో పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినాన రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు రాష్ట్రంలోనే అతిపురాతనమైన మల్లికార్జునస్వామి దర్శనం చేసుకునేందుకు ఇక్కడకు వస్తారు. భక్తులకు సేవ చేయడానికి మంచి మనస్సుతో యువతియువకులు వాలంటీర్లుగా విధులు నిర్వహించడానికి ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు. ఆసక్తి కలిగిన 99496 46208 నంబరుకు సంప్రదించాలని కోరారు.



శివరాత్రికి ముస్తాబు చేస్తున్న సత్రశాల దేవస్థానం


పూర్తి రాయితీపై ఎలుకల నివారణ మందు



రెంటచింతల: రైతులు పంటలో సామూహిక ఎలుకల నివారణ చర్యలు చేపట్టడం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి సూచించారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి, ఆయన మాట్లాడారు. రబీ వరి పంటలో ఎలుకల నివారణకు వీఏఏలు, వీహెచ్‌ఏలు సూచనల మేరకు విషపు ఎర(మందు)ను రైతులు తయారు చేసుకోవాలని సూచించారు. ఎలుకలు తినే దానికన్నా 7 నుంచి 8 రెట్లు అధికంగా ధాన్యాన్ని నష్టపరుస్తాయని చెప్పారు. ఎలుకల నివారణకు వ్యవసాయశాఖ బ్రోమోడయోలిన్ అనే మందును వంద శాతం రాయితీపై అందజేస్తున్నట్లు చెప్పారు. రెండు గ్రాముల ఈ మందును 96 గ్రాముల నూకలు, రెండు గ్రాముల వంట నూనె కలిపి 100 గ్రాముల విషపు ఎరను తయారు చేసుకోవచ్చన్నారు. ఎలుక బొరియలో 10 గ్రాముల ఎరువు పొట్ల కట్టి వేయాలని సూచించారు. వీఏఏలు పాల్గొన్నారు.

12న కొండ గురునాథస్వామి తిరునాళ్లు

నూజెండ్ల: మండలంలోని రవ్వవరంలో గ్రామంలో వేంచేసియున్న శ్రీకొండ గురనాథ స్వామి వారి తిరునాళ్ల వేడుకలు ఈనెల 12న గ్రామస్తులు సారథ్యంలో ఘనంగా జరుగుతాయి. ప్రసిద్ధి చెందిన తిరునాళ్ల వేడుకలకు ప్రకాశం, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకుంటారు. తిరునాళ్ల వేడుకలు పురస్కరించుకుని ఈనెల 11న మెట్ల పూజ, గ్రామంలో దేవత విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త లక్కిరెడ్డి రమణారెడ్డి తెలిపారు. మహిమాన్వితుడైనా స్వామిగా కొలిచే కొండ గురనాథ స్వామిగా అందరు దర్శించుకుంటారు. తిరునాళ్ల పర్వదినం రోజున విద్యుత్ ప్రభలు సాంస్కృతిక కార్యక్రమాలు వివిధ సామాజిక వర్గాలకు చెందిన అన్నదాన సత్రాల్లో భారీ అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయి. తిరునాళ్ళ వేడుకల్లో అందరు పాల్గొని స్వామివారిని దర్శించుకొని పాత్రులు కావాలన్నారు.



గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

పెదకూరపాడు: మండలంలోని గ్రామాల అభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మీరయ్య మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని తాగునీరు సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. మిర్చి ఆరుతడి పంటకు సాగునీరు సకాంలో అందించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ షేక్ చాంద్ బాషా, ఎంపీడీఓ రామకృష్ణ పాల్గొన్నారు.



తిరునాళ్లలో భక్తులకు అసౌకర్యం కలుగనీయం

కోటప్పకొండలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి, ఎంపీ, ఎమ్మెల్యేలు

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట, చిలకలూరిపేట శ్యాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కొండపై జరుగుతున్న పనులను పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్లపై ఈవో చంద్రశేఖర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ లక్షలాదిగా తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేయాలనే సంకల్పంతో తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తామని సూచించారు. రాష్ట్ర పండగ అయినందున కావాల్సిన నిధులు విడుదల చేస్తామని, కొండపై పారిశుద్ధ్యం, భక్తులకు త్వరగా దర్శనం చేసేందుకు కావల్సిన ఏర్పాట్లు చేస్తామన్నారు. సంబంధిత శాఖకు చెందిన మంత్రితో మళ్లీ కొండకు వస్తామని పేర్కొన్నారు.



కొండపై మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యేలు

కావాల్సిన ఏర్పాట్లు చేస్తాం: ఈవో

ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ వెల్లడించారు. శనివారం కొండపై కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు ఏర్పాట్లు పరిశీలించి తగిన సూచనలు చేశారని వివరించారు.

10 నుంచి జగన్నాథస్వామి బ్రహ్మోత్సవాలు



ముప్పాళ్ల: మండలంలోని చాగంటివారిపాలెంలోని సుభద్ర బలభద్ర సహిత జగన్నాథస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. 10వ తేదీన స్వామికి పంచామృత అభిషేకం, స్వామిని పెళ్లి కుమారుని చేయుట, గరుడ ధ్వజారోహణ, 11న భగవద్గీత పారాయణం, సాయంత్రం శ్రీరాధాకృష్ణుల కళ్యాణం, 12న విష్ణుసహస్రపారాయణం, గరుడ వాహన ఊరేగింపు, కోలాటం, 13న వసంతోత్సవం, 14న పూర్ణాహుతి, అన్నదానం కార్యక్రమం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో కళ్యాణోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.